# "హామీ"

చందమామని చూపించి 'అదేమిట'ని అడిగితే బాగుండేది. ఆ నక్షత్రాలు రాత్రిమాత్రమే వస్తాయేం? పగలెక్కడికి పోతాయి అనడిగినా బాగానే ఉండేది. కానీ అవేమీ అడగలేదు.

నాతోబాటే నడుస్తున్న మా "బాబు" "నాన్నా! ఆ ఇల్లు చూశావా? ఎంతపెద్దదో మనకలాంటి ఇల్లు లేదేం?"—అనడిగాడు.

ఏం చెప్పాలో నాకేం తోచలేదు. వాడ్ని దృష్టినుండి మరల్చటానికి ఓ చాక్లెట్ కొనిచ్చాను.

ఉన్నట్టుండి "ఇహ్హిహ్హి" అని కేరింతాలు కొట్టసాగాడు.

"ఏమిట"న్నట్లు చూశాను!

"నాన్నా! నాన్నా! ఆ అబ్బాయి చూశావా-ఆ కార్లో ఎలా కూర్చున్నాడో! నువ్వూ ఓ కారు కొన్నా నాన్నా! నాకెక్కాలనుంది!"

నా ప్రమేయం లేకుండానే నా కనుబొమలు ముడుచుకున్నాయి — వాడి వెధవ ప్రశ్నలకి!

"నాన్నా! నా .... న్ .... న్నా ....!" మళ్ళీ గునుస్తున్నాడు. "వెధవకి అయిస్క్రీం కావాలి కాబోలు!"-అనుకున్నాను.

"నాన్నా! చూశావా! ఆ పిల్లలు మంచి మంచి బాబా సూట్లు కొనుక్కుంటున్నారు! నువ్వెప్పుడూ కొనివ్వవ్! ప్చ్!"

నాకు మండుకొచ్చింది!

"మళ్ళీ మాట్లాడుతే నరుకుతాను!"—అన్నాను!

మళ్ళీ మాట్లాడలేదు.

ఇంటికొచ్చాక మెల్లగా చెప్పాను!

"బాబూ! ఇప్పట్నుంచీ నువ్విలాంటి ప్రశ్నలు వెయ్యకూడదు. నువ్వు పెదయ్యేటప్పటికి యిలాంటి హెచ్చు తగ్గులు తేడాలు-ఉండనే ఉండవు! అందరికీ అన్నీ సమానంగా దొరుకుతాయి! దాన్నే 'సోషలిజం' అంటారు తెల్సిందా!" అన్నాను!

* * *

పదేళ్ళ క్రితం-అయిదేళ్ళ ప్రాయంలో-ఆనాడు నేను వాడికిచ్చిన "హామీ"-ఇప్పుడు మర్చిపోయాడో-లేక అది అబద్ధం అని తెలుసుకున్నాడో కానీ-కార్లు! మేడలు అంటే వాడికిప్పుడు చచ్చేంత మంట!

'రమ'

